మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ

RNI NO:TGTEL/25/A5443

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

రాజన్న సిరిసిల్ల	శనివారం 31 అక్టోబర్ 2026	సంపుటి : 01	సంచిక : 301	పేజీలు : 12	వెల : 2/-
RAJANNA SIRICILLA	Saturday, 31 October 2026	Volume : 01	Issue : 301	Pages : 12	Cost : 2/-

Wanted Reporters
తెలుగు రాష్ట్రాల్లో దిగ్విజయంగా నడుపబడుతున్న ప్రజావాణి దిన పత్రిక మరియు ప్రజావాణి చానెల్
నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
(కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత)
Ph:9440032006

ఏపీలో పింఛన్ల పంపిణీకి ఎన్నికల సంఘం అనుమతి.. కానీ షరతులు వర్తిస్తాయి

స్థానిక ఎన్నికల వేళ పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి

ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులకు మాత్రమే పింఛన్లు ఇవ్వాలని స్పష్టీకరణ

కొత్త పేర్లను చేర్చడం, పింఛను మొత్తాన్ని మార్చడంపై నిషేధం

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. అయితే, ఈ ప్రక్రియకు సంబంధించి కొన్ని కఠినమైన షరతులను విధించింది. ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు మాత్రమే వాటిని పంపిణీ చేయాలని - మిగతా3లో



అండమాన్ సముద్రంలో అల్పపీడనం

- ఏపీ తీరం వైపు పయనం!
- దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
- అదే ప్రాంతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- రానున్న 24 గంటల్లో సుస్పష్ట అల్పపీడనంగా మారే ఛాన్స్
- పశ్చిమ వాయువ్య దిశగా కదులుతున్న వ్యవస్థ

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

- అర్నబ్ తుపాను: చివరి బాధితుడికి సాయం అందేవరకు విశ్రమించేది లేదు: సీఎం చంద్రబాబు
- అర్నబ్ తుపానుతో ఏపీ అతలాకుతలం
- యుద్ధప్రాతిపదికన విద్యుత్, రహదారులు, సమాచార వ్యవస్థల పునరుద్ధరణ పనులు
- దాదాపు 3.5 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 23 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు నష్టం
- భారీ వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాలు, భూగర్భ జలమట్టాలకు గణనీయమైన ప్రయోజనం
- క్షేత్రస్థాయి సిబ్బందితో నేరుగా మాట్లాడుతూ పనులను వేగవంతం చేస్తున్న ముఖ్యమంత్రి

అమరావతి

అర్నబ్ తుపాను సృష్టించిన విలయం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. "తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సహాయం అందేంత వరకు, ప్రతి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నేను విశ్రమించను" అని ఆయన స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఇదే సంకల్పంతో పనిచేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత నాలుగు రోజులుగా టెలీకాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లు, క్షేత్ర స్థాయి పర్యటనలతో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇవాళ పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు ప్రాంతంలో రెండో రోజు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే ముందు కూడా ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్, రహదారులు, సమాచార వ్యవస్థల పునరుద్ధరణలో సాధించిన - మిగతా3లో

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది

- ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్
- ఐడీబీఐ వాటాల విక్రయాన్ని సమర్థించిన నిర్మలా సీతారామన్
- కాంగ్రెస్ హయాంలో రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపణ
- మొండి బకాయిలపై గత ప్రభుత్వాలను విమర్శించిన మంత్రి
- రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం చేశామని వెల్లడి
- విక్రయ ప్రక్రియలో నిబంధనలు పాటించామని స్పష్టీకరణ

మియాపూర్ భూములు కొల్లగొట్టేందుకు కేసీఆర్, బంధువుల యత్నం

మియాపూర్‌లోని 550 ఎకరాలు ప్రభుత్వానివే

ఆ భూమిని కాపాడేందుకు గతంలో కేసీఆర్ సర్కార్ ప్రయత్నం చేయలేదు

మియాపూర్ భూములను కొట్టేసేందుకు గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు యత్నించారు

పనిలేక తిరుగుతున్నానా?

రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు కోసం ఈటల పాదయాత్ర
- ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని హెచ్చరిక
- నిధులు తేలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
- డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని డిమాండ్
- డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన

హైదరాబాద్

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే డిమాండ్‌తో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర ఉద్రిక్తంగా సాగుతోంది. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేంతవరకే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని ఆయన హెచ్చరించారు. పనిలేక తిరుగుతున్నానంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఈటల ఘాటుగా స్పందించారు. "డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం నేను పాదయాత్ర చేస్తుంటే, ఈటల రాజేందర్‌కు - మిగతా3లో

నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల

తుది జాబితా

- ఏపీ, తెలంగాణలో మళ్లీ మారిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ షెడ్యూల్
- రెండు రాష్ట్రాల్లోనూ నవంబర్ 30న ఓటర్ల తుది జాబితా వెల్లడి
- సీఈవోల విజ్ఞప్తి మేరకు షెడ్యూల్‌ను మార్చిన కేంద్ర ఎన్నికల సంఘం
- తెలంగాణలో నవంబర్ 26, ఏపీలో నవంబర్ 20 వరకు పొడిగించిన అభ్యంతరాల గడువు
- తెలంగాణలో 2.59 కోట్లు, ఏపీలో 42.55 లక్షల ఓటర్ల పేర్లకు తుది జాబితాలో చోటు

హైదరాబాద్

రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి మార్పు చేసింది. రెండు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల (సీఈవోలు) విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా మార్పులతో రెండు రాష్ట్రాల్లోనూ ఓటర్ల తుది జాబితా నవంబర్ 30వ తేదీన ప్రచురితం కానుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల సీఈవోలకు వేర్వేరుగా సమాచారం అందించింది. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులపై వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి సంబంధించిన గడువును తెలంగాణలో నవంబర్ 26 వరకు, ఆంధ్రప్రదేశ్‌లో నవంబర్ 20 వరకు పొడిగించింది. వాస్తవానికి పాత షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నవంబర్ 9న, ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 30నే తుది జాబితా విడుదల కావాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో సీఈవోల అభ్యర్థన మేరకు ఈసీ గడువును పొడిగించింది. సవరించిన షెడ్యూల్ వివరాలను క్షేత్రస్థాయి అధికారులందరికీ తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఈసీ తమ ఆదేశాల్లో స్పష్టం చేసింది. అదేవిధంగా మార్పు చేసిన షెడ్యూల్ గురించి రాజకీయ పార్టీలకు కూడా రాతపూర్వకంగా సమాచారం అందించాలని సూచించింది. - మిగతా3లో

భాగ్యనగరానికి తాగునీటి గండం

హైదరాబాద్‌కు జనవరి నుంచి 8 నెలల పాటు భారీ నీటి కష్టాలు: జలమండలి ఎండీ వార్నింగ్

మంజీరా, సింగూరు ప్రాజెక్టుల నుంచి 100 MGD నీటి కొరత అంచనా

హైదరాబాద్‌లో 7 నియోజకవర్గాలపై నీటి సంక్షోభ ప్రభావం

రూ.16 లక్షల లోన్ ఆశ చూపి మోసం

రూ.1.90 లక్షలు కట్టించుకుని ఎస్కేప్.. చివరికి!

తక్కువ వడ్డీకి ఓవర్‌డ్రాఫ్ట్ ఇస్తామని చెప్పి వ్యాపారికి టోకరా

ఆఫర్ కోసం ఇన్సూరెన్స్ పాలసీ కొనాలని నమ్మించిన కాల్స్

రూ.1.90 లక్షల ప్రీమియం కట్టించుకుని స్పందించని మోసగాళ్లు

ఐఆర్‌డీఏఐ పోర్టల్‌లో ఫిర్యాదు చేసి డబ్బు తిరిగి పొందిన బాధితుడు

ఇలాంటి ఆఫర్లను నేరుగా బ్యాంకులో నిర్ధారించుకోవాలని సూచన



ప్రజావాణి RNI NO:TGTEL/25/A5443
శనివారం 31 అక్టోబర్ 2026

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది..

ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ ఛైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై

సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు. ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు. 2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో దోచుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు. ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

-మొదటిపేజీ తరువాయి

పురోగతిని అధికారులు ఆయనకు వివరించారు. ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడుతూ పనుల పురోగతిని తెలుసుకుంటుండటంతో, యంత్రాంగం మొత్తం యుద్ధప్రాతిపదికన పనిచేస్తోంది.

తుపాను కారణంగా అతలాకుతలమైన వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టేందుకు వివిధ శాఖలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన 5,404 గ్రామాలకు గాను, శుక్రవారం ఉదయం 10 గంటల నాటికి 4,881 గ్రామాలకు (దాదాపు 90%) విద్యుత్‌ను పునరుద్ధరించారు. దెబ్బతిన్న 552 సబ్‌స్టేషన్లలో 513 (93%) తిరిగి పనిచేయడం ప్రారంభించాయి. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా పునరుద్ధరించబడింది. అయితే, తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్న కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పనులు ఇంకా కొనసాగుతున్నాయి. కోనసీమలో 316 గ్రామాలకు గాను 87, పశ్చిమ గోదావరిలో 318 గ్రామాలకు గాను 154 గ్రామాల్లోనే విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చింది. ఈ రెండు జిల్లాల్లోనే ఇంకా 393 గ్రామాలకు విద్యుత్ అందించాల్సి ఉంది. కృష్ణా జిల్లాలో ఏపీసీపీడీసీఎల్ పరిధిలో ప్రభావితమైన 915 గ్రామాల్లో 867 గ్రామాలకు సరఫరాను పునరుద్ధరించారు. మరోవైపు, దెబ్బతిన్న 1,045 మొబైల్ టవర్లలో 661 పనిచేయడం ప్రారంభించాయి. ఆర్అండ్‌బీ రహదారులపై కూలిన 2,270 చెట్లను తొలగించి, 137 చోట్ల నిలిచిపోయిన రాకపోకలను 119 చోట్ల పునరుద్ధరించారు.

భారీ నష్టం.. మరోవైపు జల సమృద్ధి

తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన రంగాలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, 16 జిల్లాల్లో 3,52,254 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 23,211 హెక్టార్లలో ఉద్యాన పంటలు నీట మునిగాయి. ఈ నష్టంపై వాస్తవ పరిస్థితులను అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు త్వరలో రాష్ట్రంలో పర్యటించనున్నాయి. వారికి క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని వివరించి, గరిష్ఠంగా కేంద్ర సహాయం పొందేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఒకవైపు ఇంత నష్టం జరిగినప్పటికీ, కురిసిన భారీ వర్షాలు రాష్ట్ర జల వనరులకు ఊహించని మేలు చేశాయి. అక్టోబర్ 26 నుంచి 29 వరకు కురిసిన వర్షాల వల్ల రాష్ట్రానికి సుమారు 380 టీఎంసీల నీరు లభించినట్లు అధికారులు అంచనా వేశారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా రాష్ట్రంలోని రిజర్వాయర్లలో అదనంగా 4.68 టీఎంసీల నీటిని నిల్వ చేయగా, మరో 5-6 టీఎంసీలు చేరే అవకాశం ఉంది. చిన్న నీటిపారుదల చెరువుల్లోకి 22 టీఎంసీల నీరు చేరగా, భూగర్భ జలాలు 44 టీఎంసీల మేర పెరిగాయి. రాబోయే ఐదు రోజుల్లో గొట్టా బ్యారేజీకి 16.24 టీఎంసీలు, మడ్డువలసకు 12.01 టీఎంసీల వరద నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అండమాన్ సముద్రంలో అల్పపీడనం..



దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం అక్కడే స్థిరంగా కొనసాగుతోంది. ఇది రానున్న 24 గంటల్లో మరింత బలపడి సుస్పష్ట అల్పపీడన ప్రాంతంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరకు అమరావతి వాతావరణ కేంద్రం గురువారం ఉదయం ఒక ప్రకటన విడుదల చేసింది. వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 29 ఉదయం 8:30 గంటల సమయానికి దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం నమోదైంది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఇది వాతావరణ వ్యవస్థ స్థిరంగా ఉన్నదనడానికి సంకేతమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవస్థ పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. దీని ప్రభావంతో రాబోయే 24 గంటల్లో దక్షిణ అండమాన్ సముద్రం, దానిని ఆనుకుని ఉన్న అండమాన్ & నికోబార్ దీవుల ప్రాంతాల్లో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటాయని అధికారులు తెలిపారు. ఈ అల్పపీడనం కదలికలను వాతావరణ శాఖ నిశితంగా గమనిస్తోంది. దీని తదుపరి గమనం, ప్రభావంపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. కాగా, ప్రైవేటు వాతావరణ సంస్థ విండీ.కామ్ ప్రకారం.. ఈ అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారనుంది. ఇది నవంబరు మొదటి వారంలో ఏపీ తీరాన్ని తాకే అవకాశం ఉంది.

రూ.16 లక్షల లోన్ ఆశ చూపి మోసం..

తక్కువ వడ్డీకే భారీ మొత్తంలో ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం ఇస్తామన్న మోసగాళ్ల మాటలు నమ్మి ఢిల్లీకి చెందిన ఓ వ్యాపారవేత్త రూ.1.90 లక్షలు నష్టపోయారు. తీరా మోసపోయానని గ్రహించి, పట్టువదలకుండా పోరాటం చేసి తన డబ్బును తిరిగి సాధించారు. ఈ ఘటన, ఇలాంటి ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తోంది. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీలో వ్యాపారం నడుపుతున్న పర్మిందర్ సింగ్ సిద్ధూకు 2026 జులై 28న యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధిగా పరిచయం చేసుకున్న ఓ మహిళ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. కేవలం 6.5% వడ్డీకే రూ.16 లక్షల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ మంజూరు చేస్తామని ఆమె ఆశ చూపింది. ఈ సదుపాయం పొందాలంటే సుద్ లైఫ్ (ఇండియా ఫస్ట్) ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి ఒక జీవిత బీమా పాలసీని తప్పనిసరిగా కొనుగోలు చేయాలని షరతు విధించారు. ఈ పాలసీ కింద వడ్డీతోపాటు ఏటా రూ.1.90 లక్షల ప్రీమియం చెల్లించాలని వివరించారు. ఈ ఆఫర్‌ను నిజమని నమ్మిన సిద్ధూ, జులై 30న తన క్రెడిట్ కార్డు ద్వారా రూ.1.90 లక్షల మొదటి సంవత్సరం ప్రీమియం చెల్లించారు. ఆ తర్వాత కూడా కొందరు ఆయనకు ఫోన్ చేసి, కొన్ని డాక్యుమెంట్లు అడుగుతూ, 20 రోజుల్లో ఓవర్‌డ్రాఫ్ట్ మంజూరవుతుందని హామీ ఇచ్చారు. వాట్సాప్‌లో వడ్డీ రేటు, ఇతర ప్రక్రియల గురించి కూడా చర్చించారు. కానీ, గడువు ముగిసినా ఓవర్‌డ్రాఫ్ట్ రాకపోవడంతో పాటు ఆ ఫోన్ నంబర్లు పనిచేయడం మానేశాయి. దీంతో తాను మోసపోయానని సిద్ధూ గ్రహించారు. వెంటనే ఆయన యాక్సిస్ బ్యాంక్‌ను, సుద్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీని సంప్రదించగా, 'ఫ్రీ-లుక్ పీరియడ్' ముగిసిపోయిందన్న కారణంతో రిఫండ్ ఇచ్చేందుకు బీమా సంస్థ మొదట నిరాకరించింది. దీంతో సిద్ధూ ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) వారి 'బీమా భరోసా' పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశారు. అక్కడ కూడా ఆలస్యం కావడంతో రెండోసారి ఫిర్యాదును ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. ఆయన పట్టుదల ఫలించి, చివరికి పూర్తి మొత్తం రూ.1.90 లక్షలు ఆయనకు రిఫండ్‌గా లభించింది. ఈ అనుభవం తర్వాత సిద్ధూ ఇతరులను హెచ్చరించారు. ఇలాంటి ఆఫర్లు వచ్చినప్పుడు నేరుగా బ్యాంకు శాఖలకు వెళ్లి నిర్ధారించుకోవాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఓటీపీ లేదా ఇతర సున్నితమైన సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. ఈ ఘటనపై యాక్సిస్ బ్యాంక్ నుంచి స్పందన రావాల్సి ఉంది.

మియాపూర్ భూములు కొల్లగొట్టేందుకు కేసీఆర్, బంధువుల యత్నం

హైదరాబాద్: మియాపూర్ భూములను కొల్లగొట్టేందుకు మాజీ సీఎం కేసీఆర్ ఆయన బంధువులు అనేక రకాలుగా ప్రయత్నించారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మియాపూర్‌లోని 550 ఎకరాలు ప్రభుత్వానివే

"మియాపూర్‌లోని 550 ఎకరాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ భూమిని కాపాడేందుకు గతంలో కేసీఆర్ సర్కార్ ప్రయత్నం చేయలేదు. మియాపూర్ భూములను కొట్టేసేందుకు గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు యత్నించారు. ఈ భూముల విషయంలోనే దామోదరరావుకు ఖరీదైన కారు బహుమతిగా ఇచ్చారు. కొందరు అధికారులను అడ్డంపెట్టుకుని భూములను కొట్టేయాలని చూశారు. ఈ వ్యవహారంలో కొంతమంది అధికారులను అరెస్టయ్యారు. సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించి రూ.50వేల కోట్ల ఆస్తిని కాపాడుకోగలిగాం. తీర్పు రాగానే భూములను కాపాడుకోవాలని అధికారులను ఆదేశించాం. అవసరమైతే ఆ భూములను వేలం వేసి దళిత, బహుజనుల కోసం ఖర్చు చేస్తాం. భూ కబ్జాకు యత్నిస్తే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది" అని రేవంత్ హెచ్చరించారు.

ఏపీలో పింఛన్ల పంపిణీకి ఎన్నికల సంఘం అనుమతి.. కానీ షరతులు వర్తిస్తాయి

-మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, పింఛన్ల లబ్ధిదారుల జాబితాలో ఎలాంటి కొత్త పేర్లను చేర్చరాదని, అలాగే పింఛను మొత్తంలో ఎటువంటి మార్పులు చేయరాదని ఎస్ఈసీ తన ఆదేశాల్లో పేర్కొంది. నగదు విత్‌డ్రా చేయడం నుంచి పంపిణీ వరకు మొత్తం ప్రక్రియను అధీకృత ప్రభుత్వ సిబ్బంది మాత్రమే చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ముఖ్య కార్యనిర్వహణాధికారి సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించిన తర్వాత ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. పింఛన్ల పంపిణీ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషన్ హెచ్చరించింది. ఈ నిర్ణయంతో ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలగకుండా, లబ్ధిదారులకు పింఛన్లు అందేందుకు మార్గం సుగమమైంది.

నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల తుది జాబితా..

-మొదటిపేజీ తరువాయి

గణాంకాల వివరాలు

ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,64,87,213 మంది మాత్రమే తమ వివరాలను నమోదు చేసుకున్నారు. మిగిలిన 73,39,235 మంది ఓటర్లు వలస వెళ్లినవారు, మరణించినవారు, చిరునామా మారినవారు, నకిలీ ఓట్ల (డూప్లికేట్) కేటగిరీ కింద గుర్తించి డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించారు. అక్టోబర్ 29 నాటికి అందిన సమాచారం ప్రకారం.. తెలంగాణలో జారీ చేసిన 92,88,188 నోటీసులకు గాను 92,81,189 నోటీసులు ఓటర్లకు అందజేశారు. వీటిలో 92,08,443 నోటీసులపై విచారణ పూర్తయింది. ఇప్పటివరకు మొత్తం 2,59,22,684 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి అధికారులు ఆమోదం తెలిపారు. వీరిలో 59,31,395 మంది ఓటర్ల విషయంలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించారు. మరో 30,64,168 మందిని 2002 నాటి జాబితా నుంచి మ్యాపింగ్ చేశారు. విచారణ అనంతరం 50,690 మంది ఓటర్లు జాబితాలో చేరడానికి అర్హులు కారని అధికారులు తేల్చారు. ఇక, ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి 44,28,858 నోటీసులపై విచారణ పూర్తయింది. వీటిలో 42,55,630 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి ఆమోదం లభించింది. పరిశీలన తర్వాత 1,73,662 మంది ఓటర్లు జాబితాలో చోటు దక్కించుకోవడానికి అర్హులు కారని అధికారులు నిర్ధారించారు.

పనిలేక తిరుగుతున్నావా? రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను

-మొదటిపేజీ తరువాయి

పనిలేక తిరుగుతున్నాడని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేదాకా మాత్రమే కాదు.. మీ ప్రభుత్వం కూలిపోయే వరకు నేను తిరుగుతానే ఉంటా" అని ఆయన స్పష్టం చేశారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ కోసం అయ్యే ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని ఈటల డిమాండ్ చేశారు. నివేదిక ఇస్తే, ప్రధానమంత్రి మోదీని ఒప్పించి అవసరమైన నిధులను తానే తీసుకొస్తానని ప్రకటించారు. ఒకవేళ తాను నిధులు తీసుకురావడంలో విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. అక్టోబర్ 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈటల తన పాదయాత్రను ప్రారంభించారు. డంపింగ్ యార్డ్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాలు, కాలనీల్లోని ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని, గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, తక్షణమే దాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

భాగ్యనగరానికి తాగునీటి గండం

హైదరాబాద్ నగరానికి 8 నెలల పాటు తీవ్ర నీటి కష్టాలు తప్పవని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. మంజీరా, సింగూరు జలాశయాలు అడుగంటిపోవడంతో సుమారు రోజుకు 100 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) నీటి కొరత ఏర్పడనుందని ఆయన తెలిపారు. ఈ ప్రభావం వచ్చే ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుందని హెచ్చరించారు. ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు పడిపోవడం, భూగర్భ జలాలు తగ్గడంతో సమస్య తీవ్రంగా మారిందని అశోక్ రెడ్డి వివరించారు. ఈ కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నుంచి 100 ఎంజీడీ, కృష్ణా నది నుంచి 10-15 ఎంజీడీ, ఉస్మాన్‌సాగర్ నుంచి మరో 5 ఎంజీడీ నీటిని నగరానికి తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ చర్యల ద్వారా 60 శాతం కొరతను భర్తీ చేయగలిగినా, మరో 20 నుంచి 40 శాతం నీటి ఎద్దడి కొనసాగుతుందని ఆయన అంగీకరించారు. ఈ నీటి సంక్షోభం ప్రభావం నగరంలోని ఏడు నియోజకవర్గాలపై అధికంగా ఉంటుందని అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా శేరిలింగంపల్లిలో 80 శాతం వరకు నీటి సమస్య ఉండొచ్చని అంచనా వేశారు. అలాగే పటాన్‌చెరు నుంచి నార్సింగి వరకు ఉన్న ప్రాంతాల్లో సుమారు 3 లక్షల కనెక్షన్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు తప్పవని తెలిపారు. దీంతో రాబోయే రోజుల్లో నగరవాసులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజావాణి RNI NO:TGTEL/25/A5443
గురువారం , సెప్టెంబర్ 03, 2026 తెలుగు దినపత్రిక

హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంధి పై ఆగ్రహం వ్యక్తం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

- హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వినతి
- మంత్రి గారు వెంటనే కాల్ పర్ చేసి చర్యలు తీసుకోవాలి అధికారులకు హెచ్చరిక
- వైద్యులు, నర్సుల ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి
- ఓపీ, స్కానింగ్ సేవల్లో రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యంపై దృష్టి సారించి మెరుగైన వైద్య సేవలు అందించాలి

హైదరాబాద్, అక్టోబర్ 29:హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు మంత్రి గారు వెంటనే కాల్ పర్ చేసి చర్యలు తీసుకోవాలి అధికారులకు హెచ్చరించారు

నిన్న జరిగిన ఘటనతో పాటు ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిన్న చోటుచేసుకున్న వ్యవహారంపై, అలాగే వైద్యులు, సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం జరుగుతోందని రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందాల్సి ఉండగా, అవసరమైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు.

ఓపీ సేవల్లో ఇబ్బందులు.. స్కానింగ్ కోసం రోగుల అవస్థలు

హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి హుజురాబాద్ నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ఇలాంటి సమయంలో ఓపీ సేవలు సక్రమంగా అందకపోవడం, స్కానింగ్ వంటి కీలక వైద్య పరీక్షల విషయంలో రోగులు ఇబ్బందులు ఎదుర్కోవడం ఆందోళన కలిగించే అంశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఎన్ని సార్లు రివ్యూ మీటింగ్ లు పెట్టి చెప్పిన సిబ్బంది మారడం లేదు అని అన్నారు

ప్రభుత్వ ఆసుపత్రిలోనే అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులో ఉండాల్సిన పరిస్థితుల్లో, రోగులు ఇతర ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తే పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. ముఖ్యంగా అత్యవసరంగా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన రోగులకు ఇబ్బందులు కలగకుండా, స్కానింగ్ సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులతో పాటు నర్సులు, ఇతర అవసరమైన వైద్య సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మంత్రికి విజ్ఞప్తి చేశారు. సరిపడా వైద్యులు, నర్సులు అందుబాటులో ఉంటేనే రోగులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి, మెరుగైన చికిత్స అందించేందుకు వీలవుతుందని వివరించారు.

వైద్య సిబ్బంది కొరత కారణంగా రోగులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు తలెత్తకుండా చూడాలని, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సిబ్బంది విధులను బాధ్యతాయుతంగా నిర్వహించేలా పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, రోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ఉన్న మంచి పేరును నిలబెట్టాలి

హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి కెసిఆర్ గారి ప్రభుత్వం లో ప్రజల్లో మంచి గుర్తింపు, నమ్మకం ఉన్నాయని, ఆ పేరును మరింత నిలబెట్టేలా వైద్య సేవలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన వైద్యం అందాలని, ముఖ్యంగా పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వైద్యులు మరియు సిబ్బంది కొరతను అధిగమించడంతో పాటు ఓపీ, స్కానింగ్ సేవలను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. రోగుల ఇబ్బందులను నిర్లక్ష్యం చేయకుండా, ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలి

హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఆసుపత్రిలోని సమస్యల పరిష్కారానికి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఖాళీ పోస్టుల భర్తీ, అవసరమైన వైద్య సదుపాయాల కల్పన, స్కానింగ్ సేవల మెరుగుదల, సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహకు అందజేసిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు వెంటనే మంత్రి గారు స్పందించి సిబ్బంది మరియు డాక్టర్స్ పై చర్యలు తీసుకుంటాం అని కాళీ ఉన్న సిబ్బంధిని భర్తీ చేస్తాం అని హామీ ఇవ్వడం జరిగింది హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా, వారికి అవసరమైన సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర..

భూపాలపల్లి, అక్టోబర్ 29 మన ప్రజావాణి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై జరుగుతున్న కార్యక్రమాల పురోగతిని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సమీక్షించారు. ప్రతిరోజూ చేపడుతున్న ఓటరు నమోదు కార్యక్రమాల వివరాలను పార్టీ నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఓటు అమూల్యమైనదని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైనవని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఓటరు నమోదు చేయించడంతోనే బాధ్యత ముగియదని, నమోదు చేసుకున్న ప్రతి ఓటరికి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని గండ్ర వెంకట రమణారెడ్డి కోరారు. పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేసి ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు 21 రకాల సదుపాయాలు 100 శాతం అందేలా చూడాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

ఏటూరునాగారం అక్టోబరు 29 ప్రజావాణి:తాడ్వాయి మండలంలోని మండల వనరుల కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న విద్యార్థుల అవసర వస్తువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన యూనిఫాం వస్త్రాలు, ఐడీ కార్డులు, బెల్టులు, బ్లాక్ షూస్, వైట్ షూస్, సాక్సులు, ట్రాక్ షూస్, స్కూల్ బ్యాగులు, బెడ్‌షీట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంక్ బాక్సులు, దుప్పట్లు, నైట్ డ్రెస్‌లు తదితర 21 రకాల వస్తువుల పంపిణీ వివరాలను పరిశీలించారు.ప్రతి విద్యార్థికి నిర్దేశించిన అన్ని వస్తువులు పూర్తిస్థాయిలో అందాయా లేదా రికార్డుల ద్వారా ధృవీకరించాలని, అర్హులైన విద్యార్థులందరికీ 100 శాతం వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు.ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తదానంతో పోలీసు అమరవీరులకు ఘన నివాళి

- గాయత్రి కళాశాల విద్యార్థుల సేవాభావం.. రక్తదానం ద్వారా ప్రాణదానం

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, అక్టోబర్ 29:పోలీసు అమరవీరుల త్యాగాలకు ఘన నివాళిగా భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా మానవత్వాన్ని చాటుతూ సమాజ సేవలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు.పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

ప్రాణదానం కంటే గొప్ప దానం మరొకటి లేదనే సందేశాన్ని విద్యార్థులు తమ రక్తదానం ద్వారా చాటిచెప్పారు. సమాజంలో రక్తం కొరతను అధిగమించేందుకు యువత ముందుకు రావాలని, రక్తదానం పట్ల ఉన్న అపోహలను తొలగించుకుని ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులర్పించారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలను అర్పించిన పోలీసుల సేవలను గుర్తుచేసుకున్నారు. వారి త్యాగాలకు నివాళిగా రక్తదానం చేయడం ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

ఈ కార్యక్రమంలో గాయత్రి కళాశాలల అధినేత అల్లంకి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సమ్మద్, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

అశ్వారావుపేట మున్సిపాలిటీలో రేషన్ కార్డుల పంపిణీన చేసిన జూపల్లి రమేష్ బాబు

- పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుంది మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు

ప్రజావాణి భద్రాద్రి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావు పేట మున్సిపాలిటీ కార్యాలయం లో గురువారం కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు చేతుల మీదుగా మరో 17 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు.అశ్వారావుపేట మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు మొత్తం 250 రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా జూపల్లి రమేష్ బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన నాయకులు ప్రమోద్, కాంగ్రెస్ అశ్వారావుపేట టౌన్ అధ్యక్షులు నండ్రు రమేష్, 10వ వార్డు కౌన్సిలర్ మిండా హరిబాబు, దండాబత్తుల రమేష్, షేక్ సయ్యద్ బాజీ,నార్లపాటి రాంబాబు, ఆళ్ల సత్తిబాబు , అల్లిగూడెం సర్పంచ్ కుంజా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అల్లాపూర్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆకస్మిక పర్యటన

- డ్రైనేజీ పనుల జాప్యంపై అధికారులపై ఆగ్రహం.. సున్నం చెరువు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశం



కూకట్‌పల్లి: అక్టోబర్ 29 (ప్రజావాణి)కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం డివిజన్‌లో పర్యటించిన ఆయన డ్రైనేజీ పనులు, మంచినీటి సమస్యలు, సున్నం చెరువు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు స్పష్టం చేశారు.

డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతుండటంపై ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని, వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సున్నం చెరువు అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

అల్లాపూర్ డివిజన్‌లో మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రస్తావించిన ఎమ్మెల్యే, ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా తక్షణమే అందుబాటులో ఉంటూ, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు ఐలయ్య, తిరుపతి, వీరారెడ్డి, బాబా, జిలాని, జగన్నాథము, రియాజ్, నూర్‌తో పాటు సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా పాఠశాలల స్వీపర్ల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలి: PRTU TS డిమాండ్

మెదక్:మెదక్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు జూన్ 2026 నుండి జీతాలు చెల్లించకపోవడంపై ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియం (PRTU TS) మెదక్ జిల్లా శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సుదీర్ఘ పెండింగ్ వేతనాల సమస్యను పరిష్కరించి, వారికి తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ సంఘం ప్రతినిధులు మెదక్ పార్లమెంట్ సభ్యులు (MP) శ్రీ రఘునందన్ రావు గారికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా PRTU TS జిల్లా శాఖ ప్రతినిధులు మాట్లాడుతూ, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, విద్యార్థులకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించడంలో స్వీపర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. అలాంటి కార్మికులకు గత కొన్ని నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలవారీ వేతనాలపైనే ఆధారపడి జీవించే ఈ పేద కార్మికులకు సకాలంలో జీతాలు అందకపోవడం వల్ల కనీస నిత్యావసరాలను తీర్చుకోవడం కూడా కష్టంగా మారిందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో PRTU TS మెదక్ జిల్లా శాఖ ప్రభుత్వం మరియు సంబంధిత అధికారుల ముందు క్రింది డిమాండ్లను ఉంచింది:

1. జూన్ 2026 నుండి పెండింగ్‌లో ఉన్న స్వీపర్ల వేతనాలను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే విడుదల చేయాలి.
2. వేతనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యానికి గల కారణాలను గుర్తించి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.
3. భవిష్యత్తులో ప్రతి నెల సకాలంలో వేతనాలు అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

ఈ మానవీయ సమస్యపై జిల్లా మరియు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడి, పేద కార్మికులకు త్వరగతిన జీతాలు అందేలా చొరవ చూపాలని ఎంపీ గారిని కోరినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రారంభించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

- గుట్టల బేగంపేటలో నూతన ఆలయ ప్రారంభోత్సవం





మాదాపూర్ (ప్రజావాణి): మాదాపూర్ డివిజన్ పరిధిలోని గుట్టల బేగంపేట సున్నం చెరువు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ గారు సీనియర్ నాయకులు శ్రీ ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ గారితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. నూతనంగా నిర్మించిన దేవస్థానం ప్రారంభంతో స్థానిక భక్తుల్లో ఆనందం నెలకొంది. ఈ ఆలయం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, భక్తుల పూజలకు కేంద్రంగా నిలవనుంది.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
గురువారం , సెప్టెంబర్. 03, 2026
తెలుగు డెలీ
శనివారం 31 అక్టోబర్ 2026

సమూహ యూత్ లిటరరీ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి నల్లగొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో విద్యార్థుల సమక్షం లో ప్రముఖ రచయిత డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి ఈ నెల 31వ తేదీ శనివారం హైదరాబాద్‌లోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న సమూహ యూత్ లిటరరీ ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువతలో సాహిత్యాభిరుచి, సృజనాత్మకత, భావవ్యక్తీకరణను పెంపొందించడంలో ఇటువంటి సాహిత్య వేడుకలు కీలకమని పేర్కొన్నారు. సాహిత్యాభిమాసులు, యువ రచయితలు, మిత్రులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సాహిత్య వేడుకను విజయవంతం చేయాలని సమూహ నల్లగొండ జిల్లా కన్వీనర్ ప్రభాకర్ కస్తూరి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పగడాల నాగేందర్, మోత్కూరు శ్రీనివాస్, తెలుగు శాఖ అధ్యాపకులు సందేనబోయిన ప్రభాకర్ డాక్టర్ టంగుటూరి సైదులు, దండి అంజయ్య, మామిడి లింగస్వామి, కట్ట శ్రవణ్ కుమార్, వనజ, బి. చిట్టెమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

భూ భారతి.... భూ సర్వేతో రైతుల భూములకు శాశ్వత పరిష్కారం

- హుస్నాబాద్ అర్ డి ఓ వాసం రామ్మూర్తి

మద్దూరు అక్టోబర్29, ప్రజా వాణి,రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ భారతి భూ సర్వేతో రైతుల భూములకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని హుస్నాబాద్ అర్ డి ఓ వాసం రామ్మూర్తి అన్నారు. గురువారం మండలంలోని ధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జక్కుల కనకమ్మ లింగయ్య అధ్యక్షతన రైతులతో ఏర్పాటు చేసిన భూ భారతి భూ సర్వే సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఒకప్పుడు రైతులు భూముల పట్టాల కోసం కార్యాలయం చుట్టు తిరిగే వారు అయిన కొన్ని సందర్భాల్లో పనులు కాకపోవడంతో రైతులు ఆర్థికంగా చాల నష్ట పోయిందన్నారు.ప్రస్తుతం ప్రభుత్వం భూ యాజమానుల వద్దకే వెళ్లి భూ సమస్యలను పరిష్కరించే విధంగా భూ భారతి భూ సర్వే అనే ఒక బృహత్తర కార్యక్రమం చేపట్టి వివాదాలు లేని భు రక్షణ చట్టం కోసం అధికారులను నేరుగా గ్రామాలకు పంపడం మన అదృష్టమన్నారు అదృష్టమన్నారు.జిల్లాలో 380 గ్రామాలుండగా కేవలం ధర్మారం గ్రామంలోనే సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు.103 సంవత్సరాల క్రితం జరిగిన సర్వే అనంతరం గ్రామాలు,రోడ్లు, భూములు, ప్రజల సంఖ్య పెరగడంతో కొత్త మ్యాపు కోసం ప్రభుత్వం రీ సర్వే చేస్తుందని రైతులు ఈ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే ఏ డి సుదర్శన్, తహసీల్దార్ ఏ. జి రహీమ్, అర్ ఐ కృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి మధుసూదన్, ఆయా గ్రామాల జి పి ఓలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులు ఆర్థికంగా అభివృద్ధి

- వంగపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మారెళ్ళ భాస్కర్ రెడ్డి

మద్దూరు అక్టోబర్29, ప్రజా వాణి,మండలంలోని వంగపల్లి గ్రామంలో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ కోమిరే రామస్వామి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారెళ్ళ భాస్కర్ రెడ్డి, చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి ప్రారంబించారు.ఈ సందర్బంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారెళ్ళ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులు ఆర్ధికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. అందుకోసం వరి ధాన్యం పండించిన ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని ఆయన రైతులను కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్ నారాయణ,ఉప సర్పంచ్ బొంగోనీ సుజాత సాగర్, ఏ పి ఎం ప్రకాశం, సి సీ కనకచంద్రం, వి ఓ ఏ స్వర్ణలత,గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు గుడ్ల శ్రీలత, కార్యదర్శి కవిత, కోశాధికారి స్వరూప, హమాలీ కార్మికులు, గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సేవలకు ఇతోధిక కృషి చేస్తాం

- కొండేల మారుతి
- మంథని డిగ్రీ కళాశాల స్థాపనకు ఆమరణ నిరాహార దీక్షకు 46 ఏళ్లు

మంథని నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 29, ప్రజావాణి: ప్రాంతీయ విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని పూర్వ విద్యార్థుల మండలి అధ్యక్షుడు కొండేల మారుతి అన్నారు. గురువారం మంథనిలో నిర్వహించిన 'స్మృతిపథం.. 46 వసంతాలు' ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మంథనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపన కోసం 1980లో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు 46 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మంథని ప్రాంత విద్యారంగ అభివృద్ధిపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని సూచించారు.డిగ్రీ కళాశాల అభివృద్ధికి న్యాక్ బృందం సందర్శించిన సందర్భంలో పూర్వ విద్యార్థుల మండలి అధ్యక్షుడు కొండేల మారుతి అందించిన సేవలను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పర్సయ్య అభినందించారు. కళాశాల స్థాపన కోసం ఆయన చేసిన కృషి, ఆమరణ నిరాహార దీక్ష వంటి పోరాటాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన అధ్వర్యంలో మంథని విద్యార్థి యువత చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఆడెపు లక్ష్మీనారాయణ, సీనియర్ సిటిజన్స్ ప్రతినిధి, సామాజికవేత్త పొరెడ్డి వెంకటరెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రామడుగు మారుతీరావు, బీజేపీ నాయకుడు భోగోజు శ్రీనివాస్, సామాజిక విశ్లేషకుడు మధు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

వైద్యం, విద్య, భూ రీ సర్వేపై క్షేత్రస్థాయి పరిశీలన..

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్
- వైద్యులు సమయపాలన పాటించాలి..
- విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి..
- భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం..

భద్రాద్రి జిల్లా బ్యూరో, అక్టోబర్ 29 (మన ప్రజావాణి): ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు భూ రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం రోజు రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)ను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో పాటు, లక్ష్మీదేవిపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, చంద్రుగొండ మండలం సీతాయిగూడెం రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామవరం ఎంసీహెచ్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, రక్త నమూనాల సేకరణ విధానాన్ని పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి సకాలంలో విధులకు హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

అనంతరం ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన కలెక్టర్, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సహారా సెక్యూరిటీ సంస్థకు చెందిన సంబంధిత సిబ్బందిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల సంఖ్య, రోజువారీ హాజరు వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో బోధనా విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయిలు, పాఠశాలల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేలా కృషి చేయాలని తెలిపారు.తదనంతరం చాతకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, అక్కడ నిర్వహించిన ఉదయం ప్రార్థనా కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. విద్యార్థులతో మమేకమై పాఠశాల వాతావరణాన్ని పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల హాజరు పెంపుపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. అనంతరం చంద్రుగొండ మండలంలోని సీతాయిగూడెం రెవెన్యూ గ్రామంలో చేపడుతున్న భూ రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలు, సర్వే మ్యాప్‌లను పరిశీలించి, పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీతాయిగూడెం రెవెన్యూ గ్రామ పరిధిలో ఇప్పటివరకు 50.20 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయినట్లు అధికారులు వివరించారు. గ్రామ పరిధిలో అటవీ భూముల మొత్తం విస్తీర్ణం 872.02 ఎకరాలుగా ఉందని, రోజుకు సుమారు 25 నుంచి 30 ఎకరాల విస్తీర్ణంలో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.భూ రీ సర్వేలో భాగంగా భూముల వివరాలు, సరిహద్దులు, సర్వే మ్యాప్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. భూ రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పర్యటనల్లో కలెక్టర్ వెంట వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్నినో ప్రభావం దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు వేయాలి...!

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి ఎల్నినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు. ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూగర్భ జలాలు తగ్గడం, వచ్చే ఏడాది ఆగస్టు వరకు వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున కూరగాయలు, చిరుధాన్యాలు వంటి తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని తేమతో పండే పంటలను ఎంచుకోవాలని అన్నారు. పశువుల దాణా సమస్య తలెత్తకుండా ఉచిత పశుగ్రాస విత్తనాల కిట్లను అందిస్తున్నామని అన్నారు.

వర్షాభావం దృష్ట్యా ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు రూ. 308 ల కూలీతో ఎక్కువ పనిదినాలు కల్పిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను, రైతులను వేధిస్తున్న కోతుల బెడదపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, తగిన నివారణ చర్యలు చేపడతామని కలెక్టర్ అన్నారు. ప్రాంతీయంగా వలస వస్తున్న నైజీరియా కొంగలు సంరక్షణ కోసం అటవీ శాఖ అధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను చేస్తామన్నారు.

అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే మొదటి, రెండో విడతలు మంజూరయ్యాయని, మూడో, నాలుగో, ఐదో విడతలు మంజూరు అవుతాయని, ప్రతి అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు.

రాబోయే గ్రాడ్యుయేట్ ఎంబిసి ఎన్నికల దృష్ట్యా, అక్టోబర్ 31, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు ఫారమ్-18 ద్వారా వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటరుగా నమోదు కు నవంబర్ 6 వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు. ఓటరు లిస్టులో నమోదు చేసుకున్న, గ్రాడ్యుయేట్ ఎన్నికలకు దరఖాస్తు తప్పనిసరి అని తెలిపారు. సంబంధిత తహసీల్దార్ కార్యాలయం, బూత్ స్థాయి అధికారిని సంప్రదించాలని, ఆన్లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ అన్నారు.

కార్యక్రమంలో రైతులడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్ శాఖల అధికారులు రైతులకు ఎల్నినో ప్రభావం గురించి అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, ఇరిగేషన్ డిఈ రాజేష్, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, ఎంపీడీవో రవికుమార్, వ్యవసాయ అధికారి సురేష్, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దోపిడీ కేసును 24 గంటల్లో ఛేదించిన కేపీహెచ్‌బీ పోలీసులు!

- ముగ్గురు నిందితుల అరెస్ట్.. బాల నిందితుడు అదుపులోకి
- ఐదు మొబైల్ ఫోన్లు, ఆటో రిక్షా స్వాధీనం
- నిందితుల పట్టివేతలో పీసీలు అనిల్, శ్రీనివాసరావు కీలక పాత్ర

కూకట్‌పల్లి, అక్టోబర్ 29 (ప్రజావాణి)కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి జరిగిన దోపిడీ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. మలేషియన్ టౌన్‌షిప్ బస్‌స్టాప్ సమీపంలో యువకుడిని అడ్డగించి, దాడి చేసి, ఫోన్‌పే ద్వారా బలవంతంగా డబ్బులు బదిలీ చేయించిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, ఒక బాల నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేవలం 24 గంటల్లోనే నిందితులను గుర్తించి పట్టుకోవడం పోలీసుల దర్యాప్తు వేగానికి నిదర్శనంగా నిలిచింది.

అర్ధరాత్రి యువకుడిని అడ్డగించి దోపిడీ

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. డేటా సైన్స్ కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వచ్చిన షేక్ గనీ అనే యువకుడు కేపీహెచ్‌బీలోని డీ-ఫిన్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 28వ తేదీ తెల్లవారుజామున సుమారు ఒంటిగంట సమయంలో భోజనం చేసి మోటార్‌సైకిల్‌పై హాస్టల్‌కు తిరిగి వెళ్తుండగా, కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్‌లోని మలేషియన్ టౌన్‌షిప్ బస్‌స్టాప్ వద్ద ఆటోలో వచ్చిన కొందరు అతడిని అడ్డగించారు. బెదిరింపులకు పాల్పడి, దాడి చేసి, అతడి ఫోన్‌పే ద్వారా రూ.6,000 బలవంతంగా బదిలీ చేయించుకున్నట్లు ఫిర్యాదు అందింది.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ప్రత్యేక చొరవతో నిందితుల గుర్తింపు

కేసును సీరియస్‌గా తీసుకున్న కేపీహెచ్‌బీ క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలు, అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషిస్తూ నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్‌కు చెందిన పీసీ 9552 ఎస్. అనిల్, పీసీ 757 కె. శ్రీనివాసరావు నిందితుల ఆచూకీ గుర్తించడంలో, వారి కదలికలను తెలుసుకోవడంలో ప్రత్యేక చొరవ చూపారు.

వీరి కృషి, క్రైమ్ టీమ్ సమన్వయంతో అక్టోబర్ 29న కేపీహెచ్‌బీ నెక్సస్ మాల్ సమీపంలో నిందితులను గుర్తించి పట్టుకున్నారు.

ముగ్గురు అరెస్ట్.. బాల నిందితుడు అదుపులోకి

ఈ కేసులో వల్లేటి రాజేష్ (24), బోయిన బాలరాజు అలియాస్ బూత్‌పల్లి బాలు (29), కోసతం మణికంఠ (26)లను అరెస్ట్ చేశారు. వీరితో పాటు ఒక బాల నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాల నిందితుడి వివరాలను చట్టపరమైన నిబంధనల మేరకు వెల్లడించలేదు.

ఐదు ఫోన్లు, ఆటో స్వాధీనం

నిందితుల నుంచి వివిధ కంపెనీలకు చెందిన ఐదు మొబైల్ ఫోన్లతో పాటు, నేరానికి ఉపయోగించినట్లు పేర్కొన్న టీజీ 34 టీ 3870 నంబరు గల ఆటో రిక్షాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి నుంచి బదిలీ అయిన రూ.6,000 రికవరీ కోసం దర్యాప్తు కొనసాగుతోంది.

పోలీసు సిబ్బందికి అభినందనలు

దోపిడీ కేసును వేగంగా ఛేదించడంలో ప్రత్యేక కృషి చేసిన పీసీ 9552 ఎస్. అనిల్, పీసీ 757 కె. శ్రీనివాసరావుతో పాటు క్రైమ్ టీమ్ సిబ్బంది పనితీరు అభినందనీయం. రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు, సైబర్ ఆర్థిక మోసాల విషయంలో 1930 హెల్ప్‌లైన్‌కు సంప్రదించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రజల భద్రతే లక్ష్యం.. నేరాల నియంత్రణలో ప్రజల సహకారం కీలకం.

మన సమగ్ర ప్రజావాణి RNI NO:TGTEL/25/A5443 తెలుగు డైలీ
శనివారం 31 అక్టోబర్ 2026

మంచాలలో గొర్రెల కాపరిపై దాడి.. గొర్రెల ఎత్తుకెళ్లేందుకు యత్నం!

- రెండుసార్లు ఆవ యాదయ్య పై దాడి జరిగినా నిందితులు చిక్కరా?
- గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలతో భద్రతపై ఆందోళన

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 28 (ప్రజావాణి)మంచాల: మంచాల గ్రామంలో గొర్రెల కాపరులపై దాడులు, గొర్రెల దొంగతనాల యత్నాలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి. గొర్రెల మందలను కాపాడుకుంటూ జీవనం సాగించే కాపరులకు భద్రత కరువవుతోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. గొర్రెల కాపరిపై ఇప్పటికే రెండుసార్లు దాడి జరిగినట్లు, ఈ ఘటనలకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. అయినప్పటికీ నిందితులను పట్టుకోవడంలో పురోగతి లేకపోవడంపై బాధితులు, స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

సీసీ కెమెరాలు పనిచేయకపోతే భద్రత ఎలా?

గ్రామాల్లో నేరాలను అరికట్టేందుకు, దొంగలను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు ఉపయోగపడాల్సిన కెమెరాలు పనిచేయకపోతే వాటిని ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కెమెరాల నిర్వహణ, మరమ్మతులు, నిరంతర పర్యవేక్షణపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

"ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం" అనే మాట నేరాల నియంత్రణలో కెమెరాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. అలాంటప్పుడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కెమెరాలు ఎక్కడ ఉన్నాయి? అవి పనిచేస్తున్నాయా? పనిచేయకపోతే వాటిని బాగు చేయాల్సిన బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

గొర్రెల కాపరి పరిస్థితి ఏమిటి?

రాత్రింబవళ్లు గొర్రెలను కాపాడుకుంటూ జీవనం సాగించే గొర్రెల కాపరులపై దాడులు జరిగితే వారి పరిస్థితి ఏమిటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొర్రెల కాపారి పై దాడి చేసినటువంటి వారిని పోలీసులు పట్టుకొని శిక్షించాలని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

నగర పారిశుద్ధ్యానికి శ్రమించే కార్మికుల ఆరోగ్యమే ముఖ్యం!

- కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి -- మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణినగర పారిశుద్ధ్య నిర్వహణలో నిరంతరం శ్రమించే కార్మికులు తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం నల్గొండ నగరపాలక సంస్థ కార్యాలయంలో శ్రీ సత్య డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల కోసం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ, కమిషనర్ బి. వంశీకృష్ణతో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కార్మికులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దంత సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్మికుల సంక్షేమానికి ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. శిబిరం లో డాక్టర్ అరవింద్ రెడ్డి, డాక్టర్ జీశాంక్, డాక్టర్ నందిని, ఎం.డి. నజీర్ ఖాన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ, కమిషనర్ బి. వంశీకృష్ణ, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

- ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన సర్పంచ్ గుండు రామాంజిగౌడ్

గరిడేపల్లి అక్టోబర్ 29(ప్రజావాణి) గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను గ్రామ సర్పంచ్, సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గుండు రామాంజిగౌడ్ పంపిణీ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే ఆశయంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సునీత, మాజీ ఎంపీటీసీ బాలుదూరి సందీప్, గ్రామ శాఖ అధ్యక్షుడు శంభయ్య, రాష్ట్ర డీలర్ల కార్యదర్శి గుండు గురవయ్య, యువజన నాయకులు గండు నరేష్, గుండు నరసింహ, లబ్ధిదారులు గుండు స్వప్న, గుండు ఉష, దార ధనమ్మ, మేకపోతుల విజయలక్ష్మి, గుడిగుంట్ల ధనమ్మ, పోలగాని రమణ, పగిళ్ల మహేంద్ర, సురగాని నాగమ్మ, అమరారపు సువాసిని, గంట పుష్పలత, కడప అంజమ్మ, మాచర్ల భద్రమ్మ, కడప సువార్త, వాడపల్లి నాగమ్మ, ఆలేటి మల్సూరు తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో 2 కోట్లతో బంజారా భవన్ నిర్మాణం

నారాయణఖేడ్ నియోజకవర్గం:- (ప్రజావాణి) ఇంచార్జ్ మదుసుదన్

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని గిరిజనుల ఆధ్యాత్మిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో, శ్రీ రామ్ రావు మహారాజ్ ట్రస్ట్ వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా రూ.2 కోట్లతో మంజూరు చేసిన శ్రీ భవానీ మాత, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయం, బంజారా భవన్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శేట్కర్ సహకారంతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి చేసిన కృషి ఫలితంగా ఈ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. త్వరలో నిర్వహించనున్న శంకుస్థాపన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు, స్థల అనుకూలత, నిర్మాణానికి సంబంధించిన ఇతర అంశాలపై అధికారులతో చర్చించి తగిన సూచనలు చేశారు.

బంజారా భవన్ నిర్మాణం పూర్తయితే గిరిజనులకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామాజిక సమావేశాలు, సాంస్కృతిక వేడుకలు నిర్వహించుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను భావితరాలకు అందించడంతో పాటు బంజారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఈ భవన్ దోహదపడుతుందని అన్నారు. గిరిజన సంక్షేమం, బంజారా సమాజ అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఈ సంపత్ కుమార్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహన్, నారాయణఖేడ్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు సర్దార్ నాయక్, కవిత, నారాయణ జాదవ్, చందర్ నాయక్, నెహ్రూ నాయక్, వినోద్ నాయక్, విజయ్ నాయక్, రుక్మిణి ఫుల్ సింగ్, శాంత్ కుమార్, నర్సింగ్, మహబూబ్, రామచందర్ నాయక్, జైపాల్ నాయక్, విజయ్, శంకర్, సంగ్రామ్, రాములు, హర్యా నాయక్‌తో పాటు పలువురు సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహజ ఎరువులను ఉపయోగించి భూసారాన్ని పెంచండి - ఏఓ మల్లేష్

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి గురువారం చండూరు మండలం, దోనిపాముల గ్రామంలో జరిగిన 'ఖేతీ బచావో అభియాన్' ఓ పంటల వైవిధ్యీకరణ సమావేశానికి మండల వ్యవసాయ అధికారి పి మల్లేష్ హాజరైనారు. తక్కువ రసాయన ఎరువులు ఓ పురుగుమందులు వాడి భూసారాన్ని ఓ ప్రకృతిని సంరక్షించాలని కోరారు. ఎల్ నినో పరిస్థితుల గురించి వివరించి, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి యాసంగి సీజన్‌లో వరి పంటకు బదులుగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు ఓ నూనెగింజల పంటలు పండించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఫార్మర్స్ రిజిస్ట్రీ ఇంకా కొంతమంది వారు వెంటనే సంబంధిత ఎ.ఈ.ఓ.ని కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ యొక్క ఐడి భవిష్యత్తులో ప్రభుత్వం ఇచ్చేటువంటి సబ్సిడీ అయినా ప్రామాణికంగా తీసుకుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి పద్మజ, మాజీ సర్పంచ్ పి. యాదయ్య, జి. రామస్వామి, ఎస్. లింగస్వామి, ఇతర రైతులు పాల్గొన్నారు.

గారిడేగావ్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

నారాయణఖేడ్ నియోజకవర్గం: (ప్రజావాణి) ఇంచార్జ్ మదుసుదన్

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండల పరిధిలోని గారిడేగావ్ గ్రామంలో గురువారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఉపాధి హామీ) నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే రూ.10 లక్షలతో నిర్మించనున్న మహిళా సమైక్య భవనానికి భూమిపూజ నిర్వహించారు.

అనంతరం గ్రామానికి చెందిన రాదవ్వ భర్త నర్సు గోండకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గారిడేగావ్ గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో యువత అధిక సంఖ్యలో ఉండటం సంతోషకరమని, వారిని ప్రోత్సహించి తగిన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పలు పథకాలను అమలు చేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఎమ్మెల్యే విమర్శించారు. రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా రైతులు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతిపక్ష నాయకులు కృషి చేయాలని సూచించారు. ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నగేష్, యాదవ్ రెడ్డి, మండల నాయకులు రవీందర్ పాటిల్, నరేందర్, పండరి, శ్యామ్ ముదిరాజ్, వినోద్, ఫూల్ సింగ్, మాజీ సర్పంచ్ మధుసూదన్, జైరాజ్, వెంకట్ రావు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ యువకులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శివాయపల్లిలో ఘనంగా భూ సర్వే గ్రామ సభ - భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యమన్న RDO రమాదేవి

పెద్ద శంకరంపేట, అక్టోబర్ 29 (ప్రజావాణి న్యూస్ పెద్ద శంకరంపేట ప్రతినిధి బాలరాజు):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వే కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేట మండలంలోని శివాయపల్లి గ్రామంలో బుధవారం గ్రామ సభ ఘనంగా నిర్వహించారు.

గురువారం శివాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన ఈ గ్రామ సభకు ముఖ్య అతిథులుగా మెదక్ రెవెన్యూ డివిజనల్ అధికారి RDO, ఖ. రమాదేవి , సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ . కిషన్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా =ఖా రమాదేవి గారు మాట్లాడుతూ, గతంలో భూ రికార్డుల్లో ఉన్న తప్పులను సరిదిద్ది, రైతుల భూములకు స్పష్టమైన హద్దులు నిర్ణయించి, డిజిటల్ రికార్డును రూపొందించడమే ఈ భూ సర్వే ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రతి పట్టాదారు తమ పట్టా పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, ఇతర భూ సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు.

అసిస్టెంట్ డైరెక్టర్. కిషన్ మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, డ్రోన్ సర్వే, రోవర్ పరికరాలతో ఈ భూ సర్వే నిర్వహిస్తున్నామని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, సర్వే సిబ్బందికి పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం శంకరంపేట మండల తహసీల్దార్ నారాయణ మాట్లాడుతూ, గ్రామంలో సర్వే ప్రారంభమయ్యే నాటికి పట్టాదారులందరూ తమ పొలాల వద్ద ఉండాలని, తమ భూముల హద్దులను సర్వేయర్లకు చూపించాలని కోరారు.

ఈ గ్రామ సభలో డివిజనల్ సర్వేయర్ అజీమ్, మండల గిర్దావర్ నాగరాజు, మండల సర్వేయర్ నాగరాణి, గ్రామ రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శివాయపల్లి గ్రామ పరిధిలో గల పట్టాదారులందరూ పెద్ద ఎత్తున ఈ గ్రామ సభలో పాల్గొని, భూ సర్వే పై తమకు ఉన్న సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

కూకట్‌పల్లి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- సిఎంసి కమిషనర్ సృజనతో బండి రమేష్ సమావేశం
- పార్కుల అభివృద్ధి, నాలాల నిర్మాణం, రోడ్ల విస్తరణ, నల్లచెరువులో స్టాల్స్ ఏర్పాటుపై చర్చ

కూకట్‌పల్లి, అక్టోబర్ 29 (ప్రజావాణి)కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ కోరారు. ఈ మేరకు సీఎంసి కమిషనర్ సృజనను కలిసి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు.

ఈ సమావేశంలో పార్కుల అభివృద్ధి, స్వాన్ లేక్ నాలా, బాలానగర్ నాలా పనులు, ఆరో ఫేజ్ స్పేస్‌లో పార్కు రిటైనింగ్ వాల్ నిర్మాణం, సబ్దాన్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లో డోర్ నంబర్ల సమస్యల పరిష్కారం, భూమన విజయ కోర్టు ఇండోర్ స్టేడియం, మూసాపేట్ రోడ్డు విస్తరణ వంటి అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

అదేవిధంగా కాజాకుంటలో రజకుల కోసం షెడ్లు, బోరు ఏర్పాటు, వై జంక్షన్ ఫ్లైఓవర్ పనులు, అల్లాపూర్‌లోని ఇందు గ్రేవ్‌యార్డ్ సమస్య పరిష్కారం, కూకట్‌పల్లిలో లైబ్రరీ ఏర్పాటుకు స్థలం కేటాయింపు, ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగంగా బాలానగర్ నాలా, జింకలవాడ నాలాల అభివృద్ధి, నల్లచెరువు ప్రాంతంలో స్టాల్స్ ఏర్పాటు, విద్యుత్ సమస్యలు తదితర మౌలిక సదుపాయాల అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, అవసరమైన చోట నూతన అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, నియోజకవర్గంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని బండి రమేష్ కోరారు. అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
గురువారం , సెప్టెంబర్, 03, 2026
శనివారం 31 అక్టోబర్ 2026

పరిశోధనకు కొత్త దిశ... విద్యార్థులకు స్ఫూర్తి!

- జీవ శాస్త్ర పరిశోధనలో విశిష్ట కృషి చేస్తున్న డా. డి. వీర నాగేంద్ర కుమార్

పోరుమామిళ్ల : ప్రజావాణి (అక్టోబర్ 29): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డా. డి. వీర నాగేంద్ర కుమార్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పరిశోధన రంగంలో విశేష కృషి చేస్తూ యువ పరిశోధకులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి నుండి జంతుశాస్త్రంలో పీహెచ్.డీ. పూర్తి చేసిన ఆయన, మధుమేహం వల్ల మెదడులో ఏర్పడే ఆక్సిడేటివ్ ఒత్తిడి, యాంటీ ఆక్సిడెంట్ స్థితి, శక్తి జీవక్రియ అంశాలపై సహజ ఔషధ మొక్కల ప్రభావంపై అధ్యయనం చేశారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిధులతో మద్యపానం వల్ల మెదడులో వచ్చే దుష్పరిణామాలపై పరిశోధనలు నిర్వహించారు.

ఇప్పటివరకు 70కి పైగా పరిశోధనా వ్యాసాలు స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్ ఇండెక్స్ కలిగిన అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురించారు. అలాగే 2 పాఠ్య పుస్తకాలు, 20 పుస్తక అధ్యాయాలను రచించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం పరిశోధకులకు మార్గదర్శకుడిగ , మలేషియా టెరెంగాను విశ్వవిద్యాలయ విద్యార్థుల పరిశోధనలకు ఎగ్జామినర్ గా వ్యవహరిస్తున్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని విద్యార్థులు, పరిశోధకులకు చేరువ చేయాలనే లక్ష్యంతో 'ఫ్రాంటియర్స్ ఇన్ మోడరన్ బయాలజీ', 'సింఫనీ ఆఫ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్' వంటి పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక సదస్సులను నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పిస్తున్నారు.

పరిశోధనను సాంకేతిక ఆవిష్కరణల వైపు తీసుకెళ్తూ మూడు పేటెంట్లకు దరఖాస్తు చేశారు. సుస్థిర పర్యావరణ వ్యవస్థల కోసం సమగ్ర వన్యప్రాణి నిర్వహణ వ్యవస్థ, ప్రిడిక్టివ్ కార్డియాలజీలో నానోపార్టికల్స్ కు సంబంధించిన డీప్ లెర్నింగ్ విధానం, దీర్ఘకాలిక గుండె సంబంధిత వ్యాధుల్లో క్యాచెక్సియా ప్రభావాన్ని అంచనా వేసే విధానం వాటిలో ఉన్నాయి.

ఇండియన్ జువాలాజికల్ వెల్ఫేర్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా, పలు శాస్త్రీయ సంస్థల్లో సభ్యుడిగా కొనసాగుతున్నారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ తో పాటు అంతర్జాతీయ పరిశోధక జర్నల్స్ అయినా, జర్నల్ ఆఫ్ ఎక్స్పరిమెంటల్ జువాలజీ ఇండియా, బయో కెమికల్ అండ్ సెల్లులార్ ఆర్చివ్స్, ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ జువాలజీ అండ్ అప్లై బయోసైన్స్, జర్నల్ ఆఫ్ డైవర్సిటీ స్టడీస్ లకు ఎడిటోరియాల్ మెంబర్ గ వున్నారు.14 అంతర్జాతీయ జర్నల్స్ కు పరిశోధక వ్యాసాలకు సమీక్షకుడిగా సేవలందిస్తున్నారు.

ఆయన కృషికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ వారిచే స్టేట్ బెస్ట్ రీసెర్చ్ పబ్లికేషన్ అవార్డు, ఫ్రాన్స్ లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో యంగ్ జువాలజిస్ట్ అవార్డు, అకాడమీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ అండ్ లైఫ్ సైన్సెస్, న్యూఢిల్లీ వారిచే యంగ్ సైంటిస్ట్ అవార్డు, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ వారిచే గ్లోబల్ యూత్ ఐకాన్ అవార్డు, మలేషియాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఎమినెంట్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నారు. ఎం.ఎస్సీ జంతుశాస్త్ర ప్రవేశ పరీక్షలో ప్రథమ ర్యాంకు సాధించినందుకు ప్రొఫెసర్ ఇందిరా శ్రీరామ్ నగదు బహుమతిని పొందారు. డాక్టర్ వీర నాగేంద్రకుమార్ డిగ్రీ అధ్యాపక పరీక్ష ఫలితాలలో కూడా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకును సాధించడం జరిగింది

విద్య, పరిశోధన, శాస్త్రీయ ప్రచురణలు, పుస్తక సంపాదకత్వం, పేటెంట్లు, సదస్సుల నిర్వహణ వంటి విభిన్న రంగాల్లో డా. డి. వీర నాగేంద్ర కుమార్ చేస్తున్న కృషి విద్యార్థులకు, యువ పరిశోధకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. శాస్త్రీయ పరిశోధనను బోధనతో అనుసంధానం చేస్తూ విద్యార్థుల్లో పరిశోధనా ఆసక్తిని పెంపొందించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

అభివృద్ధి కోసం కూటమిని గెలిపించాలి

- ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం: నరవ రమాకాంతరెడ్డి

పెద్దకడబూరు అక్టోబర్ : 29 ప్రజావాణి పెద్దకడబూరు: మండలంలో కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. గురువారం తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పెద్దకడబూరు ఎంపీటీసీ అభ్యర్థులు కోడిగుడ్ల దుబ్బన్న, మేస్త్రో రామాంజనేయులు, జడ్పీటీసీ అభ్యర్థి కురువ మల్లికార్జునకు మద్దతుగా ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ హామీల అమలు, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పారిశ్రామిక అభివృద్ధి, విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నరవ రమాకాంతరెడ్డి మాట్లాడుతూ.. మండలం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రైతుల వ్యవసాయ సమస్యలు, పంట పొలాల రహదారులు, ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు.

సైకిల్ గుర్తుకు ఓటేయండి

అభ్యర్థుల గత సేవలు, ప్రజలతో ఉన్న సంబంధాలు, భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి ఓటు వేయాలని కూటమి నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో బసలదొడ్డి ఈరన్న, మల్లికార్జున, నరసన్న, భాష, దుబ్బన్న, కోడిగుడ్ల ఏసేపు, గుమల ఆశీర్వాదం, ఆదాము, ఇమ్మానుయేలు, సుధాకర్, సందీప్, మీసేవ అంజనేయులు, డీలర్ హనుమంతు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- సాగర్ ఫ్యాక్టరీలో ప్రజా భరోసా, డ్రగ్స్ అవగాహన, అరైవ్ అలైవ్ కార్యక్రమాలు.

హుజూర్నగర్ అక్టోబర్ 29 (ప్రజావాణి) సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి సాగర్ ఫ్యాక్టరీలో డ్రైవర్లకు ప్రజా భరోసా, మాదకద్రవ్యాల నివారణ, అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహించారుఈ సందర్భంగా డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం ప్రమాదకరమని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉంటూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని కోరారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.

పరిశుభ్రతకు పాతర: ఇది పోరుమామిళ్ల మండల పరిషత్ ఆఫీసా? లేక చెత్తకుండీనా? ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు!

పోరుమామిళ్ల (కడప జిల్లా):అక్టోబర్ 29 ప్రజావాణి ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రభుత్వ కార్యాలయమే ఇప్పుడు అపరిశుభ్రతకు నిలయంగా మారింది. కడప జిల్లా పోరుమామిళ్ల మండల పరిషత్ (ఎంపీడీఓ) కార్యాలయం గుమ్మం ముందే ప్రభుత్వ ఉద్యోగులు బస చేసినట్లు, తిన్న ఇస్తరాకులను పారేసి కార్యాలయ ఆవరణను ఒక చెత్తకుండీలా మార్చడం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. "ఇది మండల పరిషత్ ఆఫీసా? లేక చెత్తకుండీనా?" అంటూ కార్యాలయానికి వచ్చే ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

గుమ్మం ముందే తిండి.. అక్కడే విస్తళ్ల పారేవేత!

మండల పరిధిలోని ప్రజల సమస్యలను తీర్చడానికి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రణాళికలు రచించాల్సిన ఎంపీడీవో ఆఫీసులోనే నిబంధనలు గాల్లో కలిసిపోయాయి. కార్యాలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులు మధ్యాహ్నం వేళల్లో ఆఫీస్ గుమ్మం ముందే అన్నాలు తిని, ఆ తిన్న ఇస్తరాకులను, ఎంగిలి వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేయకుండా ఏకంగా వాకిలి ముందే పారేయడం గమనార్హం. రోజురోజుకూ పేరుకుపోతున్న ఈ ఎంగిలి విస్తళ్లు, వ్యర్థాల వల్ల ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఈ అపరిశుభ్ర వాతావరణం వల్ల కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఈ దృశ్యాలను చూసి తీవ్రంగా చర్చించుకుంటున్నారు. "గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని, చెత్తను రోడ్లపై వేయవద్దని మాకు సుద్దులు చెప్పే అధికారులు.. వారి సొంత ఆఫీసులోనే ఇలా ప్రవర్తించడం ఏంటని?" ప్రజలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నతాధికారులు నివసించే, పనిచేసే చోట కనీస బాధ్యత లేకుండా ప్రవర్తిస్తే ఎలా అని ప్రజల మధ్య పెద్ద ఎత్తున గుసగుసలు, చర్చలు సాగుతున్నాయి. పరిశుభ్రత అనేది కేవలం సామాన్య ప్రజలకేనా, పెద్ద పెద్ద జీతాలు తీసుకునే మండల ఆఫీస్ ఉద్యోగులకు వర్తించదా అని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.స్వచ్ఛ భారత్, పరిశుభ్రత అంటూ ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే, ఇక్కడ మాత్రం క్షేత్రస్థాయిలో అధికారులు ఆ సూత్రాలను తుంగలో తొక్కుతున్నారు. ఆఫీస్ గుమ్మం దగ్గరే ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, పోరుమామిళ్ల మండల పరిషత్ కార్యాలయంలో అపరిశుభ్ర వాతావరణానికి కారణమైన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని, కార్యాలయ ఆవరణను శుభ్రంగా ఉంచేలా చూడాలని స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం

- పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి .అక్టోబర్ 28: (ప్రజావాణి) శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీకి చెందిన చాగంటి పూల కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 2,00,000/- రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరి పత్రాన్ని తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి బాధిత కుటుంబానికి అందచేసిన పీఏసీ చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని.. తెలిపారుఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి ,నాయి నేని చంద్రకాంత్ రావు, రాధాబాయి మరియు తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో దోపిడీ పాలన

- ప్రజలు ముందుచూపుతో ఆలోచించి ఓటు వేయండి
- వైఎస్ఆర్‌సీపీని గెలిపిస్తే ప్రజలకు తోడుగా ఉంటాం
- అనంతపురం నగర అభివృద్ధి వైసీపీతోనే సాధ్యం
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌తో కలిసి 61, 62, 60, 58 డివిజన్లలో ప్రచారం
- ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థన

అనంతపురం బ్యూరో అక్టోబర్ 29 ప్రజా వాణి జిల్లా కేంద్రమైన అనంతపురం నగరంలో రెండున్నరేళ్లుగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో దోపిడీ పాలన సాగుతోందని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీని గెలిపిస్తే ప్రజలకు జవాబుదారీగా తోడుగా ఉంటామని స్పష్టం చేశారు. గురువారం వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌తో కలిసి నగరంలోని 61, 62, 60, 58 డివిజన్లలో వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులు వాసంతి, బిందుప్రియ, సుజాత, భవాని తరఫున ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలనిఅభ్యర్థించారు.ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అనంతపురం ప్రజలు విజ్ఞతతో ముందుచూపుతో ఆలోచించి మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌తో పాటు వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పరిపాలన ఎలా సాగిందో గుర్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లామన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అనంతపురంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అనుచరులు దోపిడీ చేస్తున్న వైనాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలంతా కలిసికట్టుగా నగరాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్ఆర్‌సీపీని గెలిపిస్తే దుర్మార్గుల నుంచి, దౌర్జన్యకారుల నుంచి ప్రజలను రక్షిస్తామన్నారు. కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపుతున్నారని ఎద్దేవా చేశారు. తమను గెలిపిస్తే నగర ప్రజలకు మౌలిక సదుపాయాలను మరింత చేరువ చేస్తామని అనంత భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హామీల అమలులో వైఫల్యం చెందిందన్నారు. నగరంలో ఒక్క కొత్త పింఛన్ ఇవ్వకపోగా 1300 పింఛన్లను తొలగించినట్లు చెప్పారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్ అనేవి మోసపూరిత హామీలుగానే నిలిచిపోయాయని విమర్శించారు. బీసీ కులానికి చెందిన విద్యావంతుడైన రమేష్‌గౌడ్‌ను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టామని, ఆయనతో పాటు అన్ని డివిజన్లలో వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అనంతపురం నగరం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పీహెచ్‌సీలను బలోపేతం చేయాలి: నల్లు సుధాకర్ రెడ్డి

దోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 29 ప్రజావాణి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసి సామాన్య ప్రజలకు మరిన్ని నాణ్యమైన సేవలందించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు కొరివి,బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సిపిఐ బృందం సందర్శించి డాక్టర్ మౌనిక, డాక్టర్ స్రవంతి లతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుని ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కురవి కేంద్రంలో గదుల కొరత, స్కావెంజర్ లేకపోవడం, త్రాగునీటి సౌకర్యం అంతంత మాత్రమే ఉండటం,బలపాల కేంద్రంలో షుగర్,బి పీ.,గోలీలు గత రెండు నెలలుగా సరఫరా చేయకపోవడంతో రోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, ల్యాబ్ కు సంబంధించిన రసాయనాలు సరిపడా లేకపోవడం,ఇద్దరు డాక్టర్లను కేటాయించినప్పటికీ ఒక డాక్టర్ డిప్యూటేషన్ పై ఇతర కేంద్రానికి వెళ్లిపోవడం, ఆసుపత్రిని 12 గంటల నడిపించడం వలన జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనికాబట్టి 24/7 ఆసుపత్రి నడిపించి కావలసిన సిబ్బందిని, మందులను సమకూర్చాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు,మండల కన్వీనర్ బుడమ వెంకన్న,మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, కొరివి పట్టణ కార్యదర్శి తుర్క రమేష్, కన్నె వెంకన్న, దూదికట్ల సారయ్య, కలగూర నాగరాజు, రామగోని రవి, బొడ్డు ఉదయ్, వెంకటేశ్వర్లు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు

ఆల్విన్ కాలనీ శంషిగూడ డివిజన్‌లో బీజేపీ విస్తృత స్థాయి సమీక్షా సమావేశం:

శేరిలింగంపల్లి. అక్టోబర్ 29: (ప్రజావాణి) శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ లోని పార్టీ కార్యాలయం లో బీజేపీ సంస్థాగత కమిటీల నిర్మాణం, రాబోయే రాజకీయ కార్యక్రమాలపై విస్తృత స్థాయి సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి & శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా ఇన్‌చార్జ్ ఆలే భాస్కర్, రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్య నేతలు మాట్లాడుతూ పార్టీ కేడర్‌కు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు:

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ

కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాక సందర్భంగా నిర్వహించనున్న మహా పాదయాత్ర మరియు పర్యటనను చారిత్రక స్థాయిలో విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత కోసం ప్రతి డివిజన్‌లో నూతన కార్యవర్గాలు, ఎగ్జిక్యూటివ్ కమిటీల నియామకాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని విజయపథంలో నిలపడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియను డివిజన్ల వారీగా వేగవంతం చేయాలన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా ఇన్‌చార్జ్ ఆలే భాస్కర్ మాట్లాడుతూ డివిజన్ కమిటీలు, బూత్ స్థాయి కార్యకర్తలు సమన్వయంతో కదిలినప్పుడే అనుకున్న విజయాలు సాధ్యమవుతాయన్నారు. పార్టీ నిర్ణయించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి విధానాలను వివరించాలని దిశానిర్దేశం చేశారు.

ఈ సమీక్షా సమావేశంలో మహిపాల్ రెడ్డి , రవీందర్ రావు ,వంశీ రెడ్డి ,బాలు యాదవ్,రఘు ,రాజు, అనిల్ గౌడ్ నర్సింగ్ యాదవ్, సీతారామరాజు ,కృష్ణంరాజు డివిజన్ అధ్యక్షులు, నూతన కార్యవర్గ సభ్యులు, వివిధ మోర్చాల బాధ్యులు, పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
శనివారం 31 అక్టోబర్ 2026

బిజినెస్

మార్కెట్లో జోరుగా బియ్యం ధరలు

ప్రపంచ ఆహార ధాన్యాల మార్కెట్లో బియ్యం ధరలు ఊపందుకున్నాయి. అంతర్జాతీయంగా డిమాండ్ పెరుగుతుండటం, సరఫరాలో నెలకొన్న అనిశ్చితి వల్ల ప్రపంచ మార్కెట్లో బియ్యం ధరలు హెచ్చవుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచంలోనే అగ్రగామి బియ్యం ఎగుమతి దేశమైన భారత్‌లో ధరలు నిలకడగా కొనసాగుతుండగా, మరో ప్రధాన ఎగుమతిదారు వియత్నాంలో ధరలు గత రెండేళ్ల గరిష్ట స్థాయికి సమీపంలో ట్రేడవుతుండటం గమనార్హం.

ధరల పెరుగుదలకు కారణాలు

ఆసియా మార్కెట్లలో వరి సాగుపై వాతావరణ పరిస్థితుల ప్రభావం, రవాణా, లాజిస్టిక్స్ వ్యయాలు పెరగడం వంటి అంశాలు ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా ఫిలిప్పీన్స్, ఆఫ్రికా దేశాలు, పశ్చిమాసియా నుంచి బియ్యానికి దిగుమతి డిమాండ్ స్థిరంగా కొనసాగుతోంది. దీనికి తోడు దేశీయంగా ఖరీఫ్ సీజన్ వరి సాగు విస్తీర్ణం, వర్షపాత సరళిలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా దిగుబడి అంచనాలపై ఆందోళనలు నెలకొన్నాయి. దాంతో భారతీయ మార్కెట్లోనూ ధరలు పెరుగుతున్నాయి.

భారత మార్కెట్, ఎగుమతుల తీరు

ప్రపంచ మార్కెట్లో భారతదేశం తన పోటీతత్వాన్ని కాపాడుకుంటూనే నాణ్యమైన బాస్మతీయేతర, బాస్మతి బియ్యం ఎగుమతులను కొనసాగిస్తోంది. కొత్త పంట మార్కెట్లోకి వస్తున్నప్పటికీ దేశీయంగా మిల్లులు, ఎగుమతిదారుల మధ్య డిమాండ్ కారణంగా ధరలు మెరుగ్గా ఉన్నాయి. ముఖ్యంగా నాణ్యమైన బియ్యంకు అంతర్జాతీయంగా డిమాండ్ నెలకొనడంతో భారతీయ ఎగుమతిదారులు సానుకూల ధోరణిని కనబరుస్తున్నారు.

వియత్నాంలో సరికొత్త గరిష్టాలు

మరోవైపు, వియత్నాం ఎగుమతి మార్కెట్లోనూ ఇదే రకమైన ట్రెండ్ కనిపిస్తోంది. వియత్నాంకు చెందిన 5% బ్రోకెన్ (కఫా) బియ్యం ధరలు గరిష్ట స్థాయిని తాకుతూ గత రెండేళ్లలో ఎన్నడూ లేని ధర పలుకుతుంది. అక్కడి స్థానిక కరెన్సీ ఒత్తిళ్లు, ఎగుమతుల వేగం మందగించడం, అంతర్జాతీయ కొనుగోలుదారుల నుంచి డిమాండ్ పెరుగుతుండటంతో వియత్నాం రేట్లు పైకి కదిలాయి.

పండుగ సీజన్‌లో తగ్గిన ఫోన్లు, టీవీల అమ్మకాలు

దుకాణాల్లో పేరుకుపోయిన స్టాక్.. కంపెనీల కీలక నిర్ణయం !!

దసరా, దీపావళి వంటి పెద్ద పండుగల వేళ.. కొత్త మొబైల్ ఫోన్ కొనాలని, ఇంట్లో టీవీ మార్చుకోవాలని చాలామంది భావిస్తుంటారు. ఈ సమయంలో కంపెనీలు కూడా భారీ డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షిస్తాయి. కానీ ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. పండగల సీజన్‌లోనూ స్మార్ట్‌ఫోన్లు, టీవీల అమ్మకాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. దీంతో తయారీ సంస్థలు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నాయి. రానున్న రెండు మూడు నెలల్లో ఉత్పత్తిని ఎప్పటితో పోలిస్తే 20 శాతం వరకు తగ్గించాలని భావిస్తున్నాయి. మరోవైపు మార్కెట్లో అమ్ముడుపోని స్టాక్ పేరుకుపోవడం కంపెనీలకు కొత్త సవాలుగా మారింది.

20 శాతం వరకు తగ్గనున్న ఉత్పత్తి!

ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం.. మొబైల్ ఫోన్లు, టీవీల తయారీ సంస్థలు వచ్చే రెండు మూడు నెలల్లో ఉత్పత్తిని ప్రణాళికాబద్ధమైన స్థాయితో పోలిస్తే 20 శాతం వరకు తగ్గించే అవకాశం ఉంది. ఈ పండగ సీజన్‌లో గత ఏడాదితో పోలిస్తే యూనిట్ల వారీగా అమ్మకాలు దాదాపు 25 శాతం పడిపోయినట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా పండగల సమయంలో డిమాండ్ భారీగా ఉంటుందనే అంచనాతో కంపెనీలు ముందుగానే పెద్ద మొత్తంలో ఉత్పత్తులను తయారు చేస్తాయి. రిటైల్ దుకాణాలు, ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్‌లకు సరిపడా స్టాక్ పంపిస్తాయి. కానీ ఈసారి వినియోగదారుల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో ఇప్పటికే ఉన్న ఉత్పత్తులే అమ్ముడుపోకుండా మిగిలిపోయాయి. దీంతో కొత్తగా తయారు చేసే ఉత్పత్తుల సంఖ్యను తగ్గించి, పాత స్టాక్‌ను విక్రయించడంపై కంపెనీలు దృష్టి పెట్టనున్నాయి.

పండగల సీజన్‌లో 25 శాతం తగ్గిన అమ్మకాలు

మొబైల్ ఫోన్లు, టీవీల వ్యాపారానికి ఓనం నుంచి దీపావళి వరకు ఉండే సమయం చాలా కీలకం. ఏడాది మొత్తం అమ్మకాల్లో ఈ పండగల సీజన్ వాటా సుమారు 30 శాతంగా ఉంటుందని పరిశ్రమ అంచనా. అలాంటి కీలక సమయంలోనే ఈసారి అమ్మకాలు దాదాపు 25 శాతం తగ్గడం తయారీ సంస్థలను ఆందోళనకు గురిచేస్తోంది.
ఇదే సమయంలో 2026 జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య కూడా స్మార్ట్‌ఫోన్లు, టీవీల యూనిట్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే 10 శాతానికి పైగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. పండగల సీజన్‌లో అమ్మకాలు పెరిగి ఈ నష్టాన్ని భర్తీ చేస్తాయని కంపెనీలు ఆశించాయి. కానీ డిమాండ్ పుంజుకోకపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.

కస్టమర్లలో ఎందుకు ఆసక్తి తగ్గిపోతుంది?

అమ్మకాలు తగ్గడానికి ప్రధాన కారణాల్లో వినియోగదారుల కొనుగోలు ఆసక్తి మందగించడం ఒకటి. దీనికి తోడు మెమరీ చిప్‌ల ధరలు పెరగడం కూడా ప్రభావం చూపుతోంది. చిప్‌ల ధరల పెరుగుదలతో తయారీ వ్యయాలు అధికమవుతున్నాయి. ఫలితంగా కొన్ని మొబైల్ ఫోన్లు, టీవీల ధరలు కూడా పెరిగే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే నిత్యావసరాలు, ఇతర ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులు కొత్త ఫోన్ లేదా టీవీ కొనుగోలును వాయిదా వేస్తున్నారు. దీంతో మార్కెట్లో డిమాండ్ తగ్గి, రిటైలర్లు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద అమ్ముడుపోని ఉత్పత్తుల నిల్వలు పెరుగుతున్నాయి.

ఇక ఫోన్లు, టీవీల ధరలు తగ్గుతాయా?

ఉత్పత్తిని తగ్గిస్తున్నాయనే కారణంతో వెంటనే మొబైల్ ఫోన్లు, టీవీల ధరలు పెరుగుతాయని లేదా తగ్గుతాయని చెప్పలేం. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న స్టాక్, వినియోగదారుల నుంచి వచ్చే డిమాండ్, కంపెనీల ధరల విధానంపై ఇది ఆధారపడి ఉంటుందని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. అమ్మకాలు ఇలాగే మందకొడిగా కొనసాగితే పాత స్టాక్‌ను విక్రయించేందుకు కంపెనీలు, రిటైలర్లు ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

బాస్ సర్‌ప్రైజ్.. ఉద్యోగికి రూ.4 కోట్ల కారు గిఫ్ట్!

ఉద్యోగంలో మంచి పనితీరును కనపరిస్తే.. బాస్ నుంచి ప్రశంసలు లభిస్తాయి, ఇంకా బాగా పనిచేస్తే ప్రమోషన్లు, బోనస్‌లు వస్తాయి. కానీ ఒక ఉద్యోగి తన పనితీరుతో ఏకంగా రూ.కోట్ల విలువైన కారును గిఫ్ట్‌గా అందుకుంటే మాత్రం అది నిజంగా ప్రత్యేకమనే చెప్పాలి. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతోంది. దుబాయ్‌కు చెందిన రిచ్‌కీ ప్రాపర్టీస్ కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ దబన్ ఓత్మాన్ తమ ఉద్యోగికి ఈ సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చారు. సంస్థలో రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేస్తున్న నటాలియా చావెజ్‌కు ఖరీదైన కారును గిఫ్ట్‌గా అందించారు. దీనికి కారణం ఆమె సాధించిన అసాధారణ విజయం. గత రెండేళ్లలో నటాలియా ఏకంగా 500 మిలియన్ డాలర్లకు పైగా విలువైన రియల్ ఎస్టేట్ డీల్స్‌ను పూర్తి చేశారు. కంపెనీ మూడో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో ఈ గిఫ్ట్ అందించారు. ఈ వేడుకలో నటాలియాను 2026 సంవత్సరానికి గాను టాప్ పెర్ఫార్మర్‌గా ప్రకటించారు. దీంతో ఆమె వేదికపైకి వెళ్లి సీఈఓ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇక అవార్డు తీసుకున్న తర్వాత తిరిగి తన సీటుకు వెళ్లబోతుండగా సీఈఓ ఆమెను ఆపారు. ఇంకా కార్యక్రమం పూర్తికాలేదని, మరో సర్‌ప్రైజ్ ఉందంటూ.. అందరిలో ఆసక్తి పెంచారు. ఆ తర్వాత కౌంట్‌డౌన్ ప్రారంభించి, రిబ్బన్ కటింగ్ ద్వారా కొత్త నీలిరంగు లంబోర్గిని ఉరుస్ కారును ఆమెకు చూపించారు. అంతే.. ఒక్కసారిగా నటాలియా ఆనందంలో మునిగిపోయారు. కేవలం అవార్డు మాత్రమే వస్తుందని భావించిన ఆమెకు ఇంత ఖరీదైన కారు గిఫ్ట్‌గా రావడంతో ఆశ్చర్యపోయారు. లంబోర్గిని ఉరుస్ కారు ధర విషయానికి వస్తే.. దుబాయ్ మార్కెట్లో దీని ధర సుమారు 9 లక్షల నుంచి 15.5 లక్షల ఖూజు దిర్హామ్‌ల మధ్య ఉంటుంది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.2.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ఉంటుంది. లంబోర్గిని ఉరుస్‌లో 4.0 లీటర్ ట్విన్ టర్బో ఎ8 పెట్రోల్ ఇంజిన్ ఉంటుంది. ఇది 6000 తీజూఎ వద్ద 657 ఎఫ్త్రజూ పవర్, 2,300 తీఎజూ వద్ద 850 చీఎ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 8-స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తో లభించే ఈ కారు ఆల్ వీల్ డ్రైవ్ సిస్టమ్ పొందుతుంది. కేవలం 3.5 సెకన్లలోనే 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. దీని టాప్ స్పీడ్ గంటకు 306 కిలోమీటర్లు.

‘న్యూజిలాండ్ టూర్‌లో మా లక్ష్యం అదే’..

కోచ్ గంభీర్ ప్లాన్స్‌ను బయటపెట్టిన వరుణ్

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ భారత్ 3-0తో కైవసం

మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవడమే లక్ష్యమన్న వరుణ్

గంభీర్ సూచనలను వెల్లడించిన వరుణ్

భారత బ్యాటర్లపై స్పిన్నర్ ప్రశంసలు

తన ఫిట్‌నెస్ మెరుగైందన్న వరుణ్

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌ను ఇప్పటికే 3-0తో కైవసం చేసుకున్నా.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవడమే తమ లక్ష్యమని భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్పష్టం చేశాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌నూ గెలవాలని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తమకు సూచించారని తెలిపాడు. సిరీస్ గెలిచేశామనే ధీమాతో కాకుండా, మిగిలిన రెండు మ్యాచ్‌లను కూడా కీలకంగా తీసుకుంటామని చెప్పాడు. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా శుక్రవారం నాలుగో టీ20కి ముందు వరుణ్ మాట్లాడాడు. “ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌లోనూ గెలవాలని గంభీర్ మొదటే చెప్పారు. అదే మా లక్ష్యం. మిగిలిన రెండు మ్యాచ్‌లను రెండు మ్యాచ్‌ల సిరీస్‌గా భావిస్తున్నాం. ఆ రెండింటిలోనూ గెలవాలి” అని పేర్కొన్నాడు.

వెల్లింగ్టన్‌లో జరిగిన మూడో టీ20లో భారత్ 199 పరుగుల లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించింది. భారత బ్యాటర్ల దూకుడును వరుణ్ ప్రశంసించాడు. అంతకుమించిన ప్రదర్శన చేయడం కష్టమేనని, అయితే మరోసారి అదే తరహా ఆటను చూడాలని ఆశిస్తున్నట్లు చెప్పాడు. చిన్న మైదానాలు, ఇలాంటి పిచ్‌లపై ఆడటానికి భారత బ్యాటర్లు అలవాటు పడటం జట్టుకు కలిసొచ్చిందని అభిప్రాయపడ్డాడు. ఇటీవల గాయంతో ఇబ్బందిపడిన వరుణ్ ప్రస్తుతం తాను మెరుగైన స్థితిలో ఉన్నట్లు తెలిపాడు. సెప్టెంబర్‌లో అఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ సందర్భంగా పక్కటెముకల పక్కన కండరాల గాయానికి గురైన అతడు.. ఆసియా క్రీడలతో పాటు జపాన్‌తో జరిగిన ఏకైక టీ20కి దూరమయ్యాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ఎంపికైనా ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడలేదు. “ఇప్పుడు చాలా మెరుగ్గా ఉన్నా. ఆడేందుకు సిద్ధంగా ఉన్నా” అని తన ఫిట్‌నెస్‌పై స్పష్టత ఇచ్చాడు. భారత జట్టులో పెరుగుతున్న పోటీ గురించి కూడా వరుణ్ స్పందించాడు. దేశంలో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఎక్కువగా ఉన్నందున జట్టులో చోటు కోసం నిరంతరం శ్రమించాల్సిందేనని చెప్పాడు. ఇంటికి వెళ్లిన తర్వాత కూడా విశ్రాంతికే పరిమితం కాకుండా, తనను తాను మెరుగుపరుచుకుంటూ మంచి ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించాలని తెలిపాడు.

స్పోర్ట్స్

టీమిండియాకు బిగ్ షాక్.. న్యూజిలాండ్ సిరీస్‌కు స్టార్ పేసర్ ఔట్!

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. తొడ కండరాల గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతడిని జట్టు నుంచి తప్పిస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. మ్యాచ్‌లు ఆడేందుకు అవసరమైన పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి మరికొంత సమయం పడుతుందని వెల్లడించింది. వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా ప్రసిద్ధ్ కృష్ణ తొడ కండరాలకు గాయమైంది. అప్పటి నుంచి అతడు కోలుకుంటున్నాడు. అయితే మ్యాచ్‌లు ఆడేందుకు అవసరమైన బౌలింగ్ భారాన్ని తట్టుకునే స్థాయికి ఇంకా చేరుకోలేదు. దీంతో న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో అతడికి అవకాశం లేకుండా పోయింది.

భారత్-ఏ జట్టుతో మ్యాచ్ ప్రాక్టీస్

ప్రసిద్ధ్ కృష్ణ త్వరలోనే భారత్-ఏ జట్టుతో కలవనున్నాడు. న్యూజిలాండ్-ఏతో జరిగే చివరి నాలుగు రోజుల మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉంది. అయితే ఇందుకోసం ముందుగా ‘రిటర్న్ టు ప్లే’ (ఆర్‌టీపీ) ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. ఈ మ్యాచ్ ద్వారా ప్రాక్టీస్ పొందడంతో పాటు టెస్టు సిరీస్‌కు సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది.

సిరాజ్, నితీశ్ రెడ్డికి కొత్త బాధ్యతలు

మరో పేసర్ మహమ్మద్ సిరాజ్ అక్టోబర్ 31 నుంచి ప్రారంభమయ్యే రెండో నాలుగు రోజుల మ్యాచ్ కోసం భారత్-ఏ జట్టుతో చేరనున్నాడు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి మాత్రం నవంబర్ 4న జరిగే తొలి వన్డేలో భారత్ తరఫున ఆడతాడు. ఆ తర్వాత భారత్-ఏ జట్టుతో కలుస్తాడు. నవంబర్ 19 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్టుల సిరీస్‌కు ఆటగాళ్లను సిద్ధం చేయడంలో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

ముంబై ఇండియన్స్‌లో భారీ మార్పులు.. బ్యాటింగ్ కోచ్‌గా రాబిన్ ఊతప్ప!

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ తమ కోచింగ్ సిబ్బందిలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. భారత మాజీ స్టార్ క్రికెటర్ రాబిన్ ఊతప్పను తమ కొత్త బ్యాటింగ్ కోచ్‌గా నియమించినట్లు ప్రకటించింది. ఇప్పటివరకు బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న కీరన్ పొలార్డ్‌కు హెడ్ కోచ్‌గా ప్రమోషన్ లభించడంతో, ఆ స్థానంలోకి ఊతప్పను తీసుకువచ్చింది. గత ఐపీఎల్ 2026 సీజన్‌లో 14 మ్యాచ్‌లలో కేవలం 4 విజయాలు సాధించి తొమ్మిదో స్థానంలో నిలిచిన నేపథ్యంలో ముంబై యాజమాన్యం ఈ ప్రక్షాళన చర్యలు చేపట్టింది. కొన్ని రోజుల క్రితమే శ్రీలంక దిగ్గజం మహేల జయవర్ధనే స్థానంలో కీరన్ పొలార్డ్‌ను హెడ్ కోచ్‌గా నియమించిన ముంబై, ఇప్పుడు పూర్తిస్థాయిలో కొత్త బృందాన్ని సిద్ధం చేసింది. రాబిన్ ఊతప్ప నియామకాన్ని సోషల్ మీడియాలో ప్రకటిస్తూ.. “ఆటపై అద్భుతమైన అవగాహన, యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేసే స్పష్టత ఉన్న రాబిన్‌కు తిరిగి స్వాగతం” అని ముంబై ఇండియన్స్ పేర్కొంది. ఊతప్ప 2008లో జరిగిన తొలి ఐపీఎల్ సీజన్‌లో ముంబై తరఫున ఆడటం విశేషం. ఈ మార్పుల్లో భాగంగా బౌలింగ్ కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ పేసర్ మిచెల్ మెక్‌క్లెనగన్‌ను, ఫీల్డింగ్ కోచ్‌గా టి. దిలీప్‌ను, డెవలప్‌మెంట్ బౌలింగ్ కోచ్‌గా ధవళ్ కులకర్ణిని నియమించారు. దీంతో హెడ్ కోచ్ పొలార్డ్ నేతృత్వంలో కొత్త కోచింగ్ బృందం ఏర్పడింది. గురువారం నాడు బౌలింగ్ కోచ్‌లు లసిత్ మలింగ, పరాస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ కార్ల్ హాప్‌కిన్‌సన్‌లు జట్టును వీడుతున్నట్లు ఫ్రాంచైజీ ప్రకటించిన సంగతి తెలిసిందే. 2007లో టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన ఊతప్ప, తన ఐపీఎల్ కెరీర్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2014లో 660 పరుగులతో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్నాడు.



ఇక కొత్త బౌలింగ్ కోచ్ మెక్‌క్లెనగన్ 2015-2020 మధ్య ముంబై తరఫున ఆడి నాలుగుసార్లు టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ భారత జట్టుతో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2024, 2026 టీ20 ప్రపంచకప్‌లు గెలిచిన భారత జట్టు కోచింగ్ బృందంలో ఆయన సభ్యుడిగా ఉన్నారు. మొత్తంమీద గత సీజన్‌లోని వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుని, పాత ఆటగాళ్ల అనుభవాన్ని జోడించి, రాబోయే సీజన్‌లో బలంగా పుంజుకోవాలని ముంబై ఇండియన్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
శనివారం 31 అక్టోబర్ 2026



రెండు భాగాలుగా విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్దన'..

తొలిసారి విజయ్‌తో కీర్తి సురేష్ జోడీ

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'రణబాలి'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన.. ప్రస్తుతం 'రౌడీ జనార్ధన' అనే మాస్ రూరల్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. 'రాజా వారు రాణి గారు' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రవికిరణ్ కోలా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో మంచి అంచనాలు ఏర్పడగా.. తాజాగా సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'రౌడీ జనార్ధన' సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం మొదలైంది. కథా పరిధి, సినిమాలోని అంశాల నేపథ్యంలో రెండు భాగాలుగా తీసుకొస్తే బాగుంటుందనే అభిప్రాయంతో చిత్ర బృందం ఉన్నట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అయితే ఈ వార్తలపై నిర్మాతలు లేదా దర్శకుడు ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. సినిమా రెండు భాగాలుగా తెరకెక్కుతుందా? లేక ఒకే భాగంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఇటీవల టాలీవుడ్‌లో రెండు భాగాలుగా సినిమాలను విడుదల చేసే విధానం పెరిగింది. కథకు విస్తృతమైన పరిధి ఉన్నప్పుడు, పాత్రలు మరియు కథాంశాలను మరింత వివరంగా చూపించడానికి దర్శకులు ఈ పద్ధతిని ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ సినిమా కూడా రెండు భాగాలుగా వస్తుందనే ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరిద్దరూ కలిసి నటిస్తున్న తొలి సినిమా ఇదే కావడంతో ఈ జోడీపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కీర్తి సురేష్‌కు కథలో ఎలాంటి పాత్ర ఇచ్చారు? విజయ్‌తో ఆమె కెమిస్ట్రీ ఎలా ఉండబోతోంది? అనే విషయాలు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. 'రౌడీ జనార్దన'ను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. క్రిస్టో జేవియర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ కథగా ఈ సినిమా రూపొందుతోంది. విజయ్ దేవరకొండ మాస్ ఇమేజ్‌కు తగిన కథ, రవికిరణ్ కోలా దర్శకత్వం, కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటించడం ఈ ప్రాజెక్టుపై అంచనాలను పెంచుతున్నాయి.

గోల్డెన్ గ్లామర్‌లో జాన్వీ కపూర్..

కుర్రాళ్లను కట్టిపడేస్తున్న ఫొటోలు

'ఛావా' దర్శకుడి కొత్త సినిమా..

శ్రద్ధా కపూర్ 'ఈతా' ట్రైలర్ విడుదల!

బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన 'ఛావా' చిత్రానికి దర్శకత్వం వహించిన టాలెంటెడ్ డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఈతా' ప్రముఖ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. మహారాష్ట్ర సాంస్కృతిక జానపద కళాకారిణి, లావణీ లెజెండ్ విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ బయోపిక్ రూపొందుతోంది. ఈ చిత్రంలో శ్రద్ధా కపూర్ విఠాబాయి పాత్రలో పరకాయ ప్రవేశం చేసి కనిపించనున్నారు. ఆమె కెరీర్‌లో ఇదొక మైలురాయిగా నిలిచే పాత్ర అని ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. మహారాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే లావణీ నృత్య రూపం మరియు ఒక సాధారణ మహిళా కళాకారిణి అసాధారణ విజయాలు సాధించే ప్రయాణాన్ని ట్రైలర్‌లో అత్యద్భుతంగా హైలైట్ చేశారు. ప్రముఖ నిర్మాత దినేష్ విజాన్ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టాలెంటెడ్ యాక్టర్ రణ్‌దీప్ హూడా కూడా ఒక కీలకమైన పాత్రలో నటిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచేశారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net